

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**జిన్ రాతోకో భోర్ నహీ హై**

**ఆజ్ ఐసీ హీ రాత్ అయీ హై**

సినిమాలలో ఒక కళాకారుడికి ఒక ఇమేజీ స్థిరపడిందంటే, అతడు ఎంత ప్రయత్నించినా ఆ ఇమేజ్‌ని వదల్చుకోలేడు. ఆ ఇమేజీ పరిధిలో ఒదగాల్సి వస్తుంది. ఇమేజ్‌కి భిన్నంగా ఏం చేసినా ప్రేక్షకులు ఆదరించరు. విజయం వరించదు. దాంతో ఎంతోమంది కళాకారులు ఇమేజీకి లొంగిపోతారు. కొందరు మాత్రం తమ ఇమేజ్‌కి భిన్నంగా తమలోని కళాకారుడిని సంతృప్తిపరచుకోవాలని ప్రయత్నిస్తారు. పరాజయం పాలయి మళ్లీ ఇమేజీ పరిధిలో ఒదుగుతారు. అప్పుడప్పుడు, అవకాశం దొరికినప్పుడు తమలోని కళాకారుడిని సంతృప్తి పరుచుకుంటారు. అలా ఇమేజికి బందీ అయి కూడా తనలోని కళాకారుడిని సంతృప్తి పరచుకోవాలని ప్రయత్నించాడు నటుడు, గాయకుడు, నిర్మాత, దర్శకుడు, సంగీత దర్శకుడు కిషోర్‌కుమార్. కానీ అధికంగా కిషోర్ కుమార్ గాయకుడిగానే తెలుసు. అదీ అల్లరి చిల్లరి పాటల గాయకుడిగా. నటుడిగా కూడా అల్లరి చిల్లరి వేషాలకి కిషోర్ కుమార్ ప్రసిద్ది. కిషోర్ కుమార్ నిజానికి చాలా గంభీరమైన వ్యక్తి. అల్లరి చిల్లరి వేషాల వెనుక ఒక తాత్వికుడు, జీవితానికి అర్థాన్ని అన్వేషించే వ్యక్తి దాగున్నాడు. అందుకే తనలోని తృష్ణను సంతృప్తి పరచుకునేందుకు, తనలోని సీరియస్ గాయకుడిని, నటుడిని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు స్వయంగా 'దూర్ గగన్‌కీ ఛావోమే' అనే సినిమా నిర్మించాడు కిషోర్ కుమార్. ఆంగ్ల సినిమా 'ది ప్రౌడ్ రెబెల్' ను భారతీయాకరణ చేసి 'దూర్ గగన కీ ఛావోమే' గా నిర్మించాడు కిషోర్ కుమార్. చాలా సీరియస్ సినిమా. సినిమా నడవలేదు. పాటలు కూడా అందరి మెప్పు పొందాయి కానీ సూపర్‌హిట్‌గా నిలచి సినిమాకు వ్యాపారపరంగా ఎలాంటి లాభం కలిగించలేదు.

ఓ సైనికుడి భార్య మంటల్లో కాలిపోతుంది. అది చూసిన కొడుకు మూగవాడవుతాడు. కొడుక్కి మాట తెప్పించేందుకు చికిత్సకోసం ప్రయత్నిస్తూంటే ఓ అమ్మాయి పరిచయమవుతుంది. ఆమె ఆస్తిని ఊళ్లో పెద్దలు కాజేయాలని ప్రయత్నిస్తుంటారు. వారినుంచి ఆ అమ్మాయి ఆస్తిని రక్షించి, పిల్లవాడికి గొంతును సరిచేసి ఆ అమ్మాయిని హీరో పెళ్లి చేసుకోవటం సినిమా కథ . హిందీలో సినిమా పరాజయం పొందింది కానీ ఇదే కథతో తమిళంలో, తెలుగులో తీసిన

సినిమాలు సూపర్‌హిట్ అయ్యాయి. తెలుగులో ఎన్టీ రామారావు, జమునలు నటించిన 'రాము', 'దూర్ గగన్ కీ ఛావోమే' తెలుగు సేత.

**మంటలు రేపే నెలరాజా, ఈ తుంటరి తనమూ నీకేలా?**

**వలపులు రేపే విరులారా, ఈశిలపై రాలిన ఫలమేమి?**

తెలుగులో హిందీ పాట 'జిన్ రాతోంకె భోర్ నహీ హై' కి సమానమైన పాట 'మంటలు రేపే నెలరాజా' నిజానికి ఇది ఎవరైనా లోతుగా అధ్యయనం చేయాల్సిన విషయం. కథ అదే. దృశ్యం అదే. భావన అదే. కానీ హిందీ పాట తెలుగులోకి వచ్చేసరికి కవి దృష్టి మారుతుంది. పాటలో భావవ్యక్తీకరణ మారుతుంది.

'జిన్ రాతోంకో భోర్ నహీ హై' అంటే, ఏ రాత్రికయితే తెల్లవారటం అన్నది లేదో అలాంటి రాత్రి.తెల్లవారటంలేని రాత్రి. అలాంటి రాత్రి వచ్చిందట ఆ రోజు. అంటే అతని జీవితం అంతా చీకటే అన్నమాట. ప్రేమించిన భార్య, కట్టుకున్న ఇల్లు అగ్నికి ఆహుతి అయిపోయాయి. ఒక్కగానొక్క కొడుక్కు మాటపోయింది. ఇక అతని జీవితంలో వెలుతురు అన్నది ఏముంది? పగలు కూడా చీకటే. పూర్తిగా నిండయిన విషాదం. సంపూర్ణమైన విషాదం. అతని విషాదానికి అంతులేదు. అతని జీవితంలో వెలుతురు లేదు.

హిందీలో ఈ పాటను రాసింది శైలేంద్ర. సాహిర్, మజ్రూహ్ ల సరసన సగర్వంగా నిలబడగల గేయరచయిత శైలేంద్ర. గమనిస్తే, ఆనాటి కవులు తమవ్యక్తిత్వాన్ని తమ పాటలలో పొందు పరచారు. సినీ సందర్భ పరిమితులు తమ ప్రతిభకు సరిహద్దులుగా భావించలేదు. సినీ సందర్భ పరిధిని దాటి తమ పాటలకొక సార్వజనీనతను ఆపాదించారు. శైలేంద్ర పాటలనేకం'కొటేషన్లకు' పనికి వస్తాయి. అత్యంత సరళమైన పదాలతో, తేలికగా అర్ధమయ్యే భావంతో, లోతైన ఆలోచనను తమలో పొదుగుకుని ఉంటాయి అతని గీతాలు. ఈ పాటకు సంగీతం కూర్చింది కిషోర్ కుమార్. కేవలం హార్మోనియం, తబలాలలతో, సంగీత వాయిద్యాలు ఉన్నాయా? లేవా? అనిపించే రీతిలో, పాటలోని భావం, గాయకుడి స్వరంలో చిలికే భావాలే ప్రధానంగా రూపొందించాడు కిషోర్ కుమార్ పాటను. పాటను రూపొందించిన విధానంలోనే తానొక సీరియస్ గాయకుడని, తనలో అత్యద్భుతమైన ప్రతిభ దాగుందని నిరూపించాలన్న తపన కనిపిస్తుంది. ఈ పాటను భైరవి రాగంలో రూపొందించటం ఒక చమత్కారం. భైరవి రాగం సాధారణంగా సూర్యోదయం కన్నా ముందరి సమయంలో, అంటే ఇక ఉదయం అవటానికి ఎంతో సమయం లేదన్న సమయంలో పాడతారు. ఈ రాగంలో పాటను రూపొందించటంలో చమత్కారం ఏమిటంటే, ఉదయం పాడే రాగంలో విషాద గీతం పాడుతూ తన జీవితంలో ఉదయం అన్నదే లేదనటం. అందుకే పాట విడిగా వింటూంటే అత్యద్భుతమైన ప్రభావం ఉంటుంది. దుర్భరమైన నిరాశలో, విషాదంలో ఉన్న వారి హృదయానికి సహానుభూతితో సాంత్వననిస్తుంది..

తెలుగులో పాటను రచించింది దాశరథి. కిషోర్ కుమార్‌కు ప్రధానంగా హాస్యనటుడి ఇమేజ్ ఉండటంతో సినిమాలో దృశ్యం ప్రభావం విరుద్ధంగా ఉంటుంది. సినిమాలో చూస్తుంటే అంత తీవ్రమైన విషాదం అనిపించదు. చిత్రీకరణ కూడా మామూలుగా ఉంటుంది. నాయిక ఆశ్రయం ఇవ్వగానే 'నా జీవితంలో చీకటి. నువ్వే వెలుతురైరా' అని ఆమె సానుభూతి కోసం పాట పాడిన భావన కలిగి పాట తీవ్రత తగ్గుతుంది.

తెలుగులో ఎన్టీ రామారావు అన్ని రకాల పాత్రలూ ధరించాడు. దాంతో అతడి విషాదం ఎబ్బెట్టుగా అనిపించదు. పైగా, గేయ రచయిత, విషాదాన్ని వ్యక్తిగతంగానే ప్రకటించాడు. హిందీలో వ్యక్తిగత విషాదానికి సార్వజనీన స్థాయిని కల్పిస్తే, తెలుగులో పాటలో పాత్ర 'ప్రేమ' కోసం తపిస్తున్న భావనను కలిగించాడు. అంటే, తెలుగులో విషాదం తీవ్రత ఉన్నా అది విరహవేదన గీతంగా మారింది. అందుకే 'ఏ రాత్రికి తెల్లవారటం లేదో ' అని హిందీలో అంటే, తెలుగులో మంటలు రేపే నెలరాజు తుంటరి తనాన్ని ప్రస్తావిస్తున్నాడు, వలపులు రేపే విరులు శిలపై రాలి లాభం లేదంటున్నాడు. ఈ 'వలపులు రేపే విరులు' అనటంతోటే పాటలో విరహవేదన ప్రవేశిస్తుంది. నాయికకు సూచన అందుతుంది. శిలలో ప్రాణంపోయగలదామెనే అన్న భావన కలుగుతుంది. దాంతో నాయకుడి విషాదం కన్నా ప్రేయసి పిలుపుగా పాట అర్ధమవుతుంది. అయితే, ఘంటసాల గొంతులో విషాదం , ఎన్టీరామారావు ముఖంలోని విషాదంతో కలగలసిపోయి పాట ప్రభావాన్ని పెంచుతుంది.

**రాత్ కె తారో తుంహి బతాదో**

**మేరీ వో మంజిల్ హై కహా**

**పాగల్ బన్‌కర్ జిస్కే లియే మై**

**ఖో బైఠా హూ దోనో జహాన్**

ఇక్కడ శైలేంద్ర పాట స్థాయిని పెంచుతున్నాడు. విషాద తీవ్రతను మానవ జీవిత పరమార్ధం అన్వేషణతో ముడిపెడుతున్నాడు. తారకలు ఆకాశంలో ఉంటూ మనం చేసే పనులు చూడటమే కాదు మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. దారి చూపిస్తాయి. అందుకే తమ గమ్యం ఏమిటో చెప్పమని తారలను అడుగుతున్నాడు. ఆ గమ్యం కోసం అన్వేషణలో సర్వం కోల్పోయానంటున్నాడు హీరో. ఇక్కడ పాట సినిమాలో నాయికా నాయకుల ప్రేమ, విరహం, విషాదం వంటివేవీలేకుండా, సినిమాలో నాయకుడి వేదన స్థాయిని దాటి ఒక తాత్త్విక భావనను కలిగిస్తుంది.

**ఆకాశానికి అంతుంది.. నా ఆవేదనకు అంతేదీ**

**మేఘములోన మెరుపుంది. . నా జీవితమందునా వెలుగేది.**

చాలా సరళంలో వెలుగులేని తన జీవితంలోని దుర్భర విషాదాన్ని వ్యక్తపరచాడు హీరో. అంతులేని ఆవేదన అతనిది. వెలుగులేని జీవితం అతనిది.

**తీగలు తెగిన వీణియపై.. ఇక తీయని రాగం పలికేనా**

**ఇసుక ఎడారిని ఎప్పుడైనా ఒక చిన్న గులాబీ విరిసేనా.**

విషాదంలోనే ఆశాభావం ప్రకటిస్తున్నాడు కవి. నాయకుడి మనసులోని మాటను ప్రతీకాత్మకంగా ప్రదర్శించాడు. మోడు వారిన జీవితం చిగురించదంటున్నాడు. 'రాగం పలికేనా, గులాబీ విరిసేనా ' అనటంలో 'పలకదు, విరియదు' అన్న భావన ఉన్నా, అంతర్లీనగా పలుకుతుందేమో, విరుస్తుందేమో నన్న ఆలోచన తొంగి చూస్తూంటుంది. ఎందుకంటే నాయిక పాట వింటోంది. అతడి విషాదం పట్ల సానుభూతి చూపిస్తుంది. మన సినిమాల గురించి తెలుసు కాబట్టి మనకు విషాదం కన్నా ఆశాభావం కనిపిస్తుంది.

**రాహ కిసీకే హుయీ నా రోషన్**

**జల్నా మెరా బేకార్ గయా**

**లూట్ గయా తక్దీర్ ముఝే**

**మె జీత్ కె బాజీ హార్ గయా**

హిందీలో పాట స్థాయి, తీవ్రత తెలుగు పాటకు భిన్నం. అతను తన శరీరాన్ని దగ్ధం చేసుకున్నా ఎవరి దారిలో వెలుతురు కాలేకపోయాడు. ఇతరుల దారిలో వెలుగు చూపేందుకు తాను బలయిపోవటం గొప్ప త్యాగం. ఇక్కడ నాయకుడిది ఎంత దుర్భర పరిస్థితి అంటే, తాను బలయిపోతున్నా ఎవరికీ ఎలాంటి లాభం కలగటంలేదు. విధి ఎంతగా దోచిందంటే, గెలిచేవాడు ఓడిపోయాడు. ఇక్కడ తన దురదృష్టాన్ని తిట్టుకోవటం, తాను ఎవరికీ ఉపయోగపడకపోవటం వంటి విషాదాలున్నాయి. ఎదుటి వారికి ఉపయోగపడటం అత్యుత్తమం. అంటే, తాను ఎందుకూ పనికిరాకుండా పోయాడన్నమాట. ఏఎంత తపన పడ్డా మరణించిన భార్యను బ్రతికించలేదు. కొడుకు స్వరం తెప్పించలేదు. తన జీవితం ఎందుకూ కొరగాకుండా పోయింది.

**మదిలో శాంతి లేనపుడూ ఈ మనిషిని దేవుడు చేశాడు**

**సుఖమూ, శాంతి, ఆనందం నా నొసటను వ్రాయుట మరచాడు.**

పూర్తిగా వ్యక్తిగతం. దేవుడు తనకు సుఖమూ, శాంతి ఆనందం ఇవ్వటం మరచిపోయాడు అదీ కథ. హిందీలో వ్యక్తిగత వేదనకు తాత్విక భావనలు జోడిస్తే, తెలుగులో వ్యక్తిగత వేదనను, సందర్భ పరిధిలో ఒదిగించి, వ్యక్తిగత స్థాయిలోనే ఉంచాడు. అందుకే తెలుగులో పాట అద్భుతంగా ఉంటుంది. కానీ హిందీలో పాట వింటూంటే పలురకాల ఆలోచనలు చుట్టుముడతాయి. ఇది 'గుడిగంటలు' సినిమాలోని 'జన్మమెత్తితిరా' హిందీ 'ఆద్మీ'లో దానికి సమానమైన 'ఆజ్ పురానీ రాహోంసే ' పాటలు వింటే మరింత స్పష్టమౌతుంది.

**జన్మమెత్తితిరా అనుభవించితిరా**

**బ్రతుకు సమరంలో పండిపోయితిరా**

**మంచి తెలిసి మానవుడిగా మారినానురా**

'గుడిగంటలు'లో ఘంటసాల అద్భుతంగా ఎంతో వేదనతో పాడిన పాటను రాసింది పినిశెట్టి. సందర్భంలో చక్కగా కుదిరింది. జీవిత పోరాటంలో ఓడిపోయాడు క్రోధలోభ మోహములతో రగిలిపోయి పతనమయ్యాడు. ఇప్పుడూ మంచి ఏదో, చెడు ఏదో తెలిసి మనిషిగా మారాడు. మనిషి కూడా పశువే. తనలోని పశుత్వాన్ని గుర్తించి, అర్థం చేసుకుని, అణచివేసి మానవత్వాన్ని ప్రదర్శించిన వాడు మనిషి అవుతాడు.

ఇప్పుడు నాయకుడు తన తప్పు తెలుసుకుని మనిషి అయ్యాడు.

**ఆజ్ పురానీ రాహోంసే కోయి ముఝే ఆవాజ్ నదే**

**దర్ద్ మె డూబీ గీత్ న దే, గం క సిసకతా సాజ్ నదే.**

హిందిలో పాట అర్థం తెలుగు పాటకు కాస్త దగ్గరగా ఉన్నా దృష్టి పూర్తిగా భిన్నం. 'పురానీ రాహ' అంటే 'పాత దారులు' అన్నది సామాన్యార్థం. అంటే గతంలోని అనుభవాలు, గతంలో తన పొరపాట్లు, దోషాలు , తన గత జీవితానుభవాలు అన్నది అసలు అర్థం. వాటిని తనను పిలవవద్దు, తన జోలికి రావద్దంటున్నాడు. అంటే తనను తప్పుదారి పట్టించిన 'చెడు' ఏదైతే తన గత జీవితంలో ఉందో, ఆ 'చెడు'ను అతడు మరచిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. తనని టెంప్ట్ చేయవద్దంటున్నాడు. తరువాత వాక్యం పాట స్థాయిని పెంచుతుంది. బాధాతప్తగీతం, విషాదంతో గతి తప్పిన రాగం తనకు వద్దంటున్నాడు. అంటే సంపూర్ణంగా తన గతంతో సంబంధం తెంచుకుని చెడును నిర్జించి మంచివైపు ప్రయాణిస్తునాడన్నమాట. చెడు విషాదకారకం. తాత్కాలికంగా ఆనందం కలిగిన భ్రమను కలిగిస్తుంది. కానీ చెడువల్ల వినాశనం, విషాదం తప్ప మరొకటి లభించదు. జ్ఞానం ఆనందమయం. అందుకే దుఖ గీతం వద్దంటున్నాడు.

హిందీ పాటను 'భీం పలాసీ ' రాగంలో రూపొందించాడు నౌషాద్. రఫీ, నౌషాద్, షకీల్ బదాయునిలది అత్యద్భుతమైన స్నేహం. రఫీకి తాను పాడుతున్న పాటల పట్ల అసంతృప్తి.అవి తనలోని కళాకారుడికి సంపూర్ణ న్యాయం చేయటం లేదన్న భావన రఫీని జీవితాంతం వెంటాడింది. ఇది నౌషాద్‌కి తెలుసు. అందుకని రఫీకోసం ప్రత్యేకంగా శాస్త్రీయ సంగీత ఆధారిత గీతాలు సృజించేవాడు. షకీల్ కూడా కవితాత్మక, తాత్త్విక గీతాలు రఫీకోసం ప్రత్యేకంగా రచించేవాడు. రఫీ అలాంటి పాటలను హృదయలోతుల్లోంచి పాడేవాడు.

ఆజ్‌పురానీ రాహోంసే ' పాటలో 'ర' అన్న పదాన్ని రఫీ పలికిన విధానం గమనార్హం. 'పురానే 'లో 'రా ' దీర్ఘం తీస్తాడు. ఆ దీర్ఘంలోనే తెలుస్తుంది. గతాన్ని ఎంతో దూరంలో వదిలేశాడని. 'దర్ద్' లో 'ర్ర్ర్ ' అని 'ర ' పై ఒత్తిడినివ్వటం, బాధ అనే పదాన్ని పలకటమే ఎంత బాధాకరమో స్పష్టం చేస్తుంది. ఒక గాయకుడి గొప్పతనం, అతను ఒకో అక్షరాన్ని

పలికేతీరు, అలా అక్షరాన్ని పలకటం ద్వారా భావం స్ఫురించేట్టు గానం చేయటంలో తెలుస్తుంది. 'దర్ద్' అని ప్రతిసారీ ప్రత్యేకంగా అనటం, 'బాధ' అనే భావనలోని 'బాధను' తెలుపుతుంది. 'గం క సిసకతా ' అనటం మరీ ప్రత్యేకం. 'సిసక్‌నా' అంటే వెక్కిళ్లు రావటం. వెక్కిళ్లతో ఏడ్చేంత బాధ అంటే వెక్కి వెక్కి ఏడ్చే రాగాన్ని ఇవ్వద్దంటున్నాడు. చెడు ప్రభావంచెడుగానే ఉంటుంది. దుఃఖం కలిగిస్తుంది. దుఃఖం వద్దంటే మంచి చేయాలి. ఫలితం మంచిదే అవుతుంది. అంటే, నాయకుడు చెడును సంపూర్ణంగా వదలి మంచిని స్వీకరించాడన్నమాట. తెలుగు పాటలో ఈ భావం కనిపించదు. జన్మమెత్తాను, అనుభవించాను – బ్రతుకులో ఓడిపోయాను. మంచి తెలుసుకున్నాను. మనిషిగా మారాను అంటాడు తెలుగులో. హిందీ పాటలో ఈ మంచి తెలిసి మనిషిగా మారటానికి ప్రాధాన్యం. మంచిగా మారిన తరువాత మళ్లీ చెడును దగ్గర రానివ్వకపోవటానికి ప్రాధాన్యం.

**స్వార్ధమను పిశాచి మదిని స్వారి చేసెరా**

**బ్రతుకంతా చెలరేగిన ప్రళయమాయెరా**

**దైవశక్తి మృగత్వమునె సంహరించిరా**

**సమరభూమి నా హృదయం శాంతిపొందెరా**

హిందీ పాటలో సూచ్యప్రాయంగా ఉన్న దాన్ని తెలుగులో స్పష్టం చేస్తున్నాడు. వివరిస్తున్నాడు. 'ఆజ్‌పురానీ రాహ'. 'దర్ద్‌మె డూబీ గీత్ ', 'గంక సిసక్ తా సాజ్ ' అనటంలోని ప్రతీకాత్మకత విడనాడి తెలుగులో గతాన్ని వివరిస్తున్నాడు. గతాన్ని విస్మరించి, మరచిపోవాలనుకునేవాడు మళ్లీ దాన్ని గుర్తు తెచ్చుకోవటం అనౌచిత్యం. దైవశక్తి మృగత్వాన్ని సంహరించటం, హృదయం సమరభూమి కావటం, శాంతిపొందటం నాయకుడి మనఃస్థితిని తెలుపుతుంది. సినిమాలో కొత్తజీవితాన్ని ఆరంభిస్తున్న నాయకుడి నిశ్చయాన్ని తెలుపుతుంది.

**బీతె దినోంకి యాద్ థే జిన్మె మైవొతరునే భూల్ చుకా**

**న వొ దిల్ న సనం న వో దిన్ ధరం**

**అబ్ దూర్ హు సారె గునాహోంసే**

ఏం జరిగిందో స్పష్టంగా చెప్పకుండా అన్నీ దౌష్ట్యాలకు దూరంగా ఉన్నానని చెప్తున్నాడు హీరో హిందీలో. గతం గాథలను మరచిపోయాడు. ఇప్పుడు అతని గమ్యం వేరు. గతంతో సంబంధం తెగిపోయింది. ఇప్పుడు ఆ హృదయం లేదు. చెడు తలపులు లేవు. తెలుగులో హిందీలో భావం దాదాపుగా ఒకటే అయినా 'ఔచిత్యం', ఉదాత్తత హిందీ పాటలో అధికంగా కనిపిస్తుంది. గతాన్ని మరచి, సంపూర్ణంగా సంబంధం తెంచుకునే వాడు మళ్లీ గతంలో నేరాలను, ఆ నేరాలకు కారణాలను స్మరించటం అనౌచిత్యం. వాటి పేరే ఎత్తడు.

క్రోధలోభ మోహములే పడగలెత్తెరా
బుసలు కొట్టి గుండెలోన విషము గ్రక్కెరా
ధర్మజ్యోతి తల్లివోలె ఆదరించెరా
నా మనసే దివ్య మందిరముగ మారిపోయెరా

పాట భావం సులభం. మళ్లీ తన పతనానికి దారి తీసిన వాటిని స్మరిస్తున్నాడు. మనసు దివ్య మందిరంగా మారిపోయిందని స్పష్టం చేస్తున్నాడు. హిందీలో పాట మొత్తం మూడు చరణాలు. ఈ భావం మూడవ చరణంలో వస్తుంది. కానీ వ్యక్తి ఆ స్థాయికి హఠాత్తుగా చేరలేడు. అదొక క్రమంగా జరిగే విషయం. రాత్రికి రాత్రే మనిషి మారిపోడు. ఒంటెమీద బరువులు వేస్తూంటే చివరికి గడ్డిపోచ వేయగానే ఒంటె పడిపోతుంది. అది గడ్డిపోచ బరువువల్ల కాదు. అంతకు ముందునుంచీ ఉన్న బరువువల్ల. ఈ గడ్డిపోచ బరువు భరించలేకపోయింది. మనిషీ అంతే. మార్పు హఠాత్తుగా అనిపించినా అది క్రమ పద్ధతి ప్రకారం, దీర్ఘకాలంలో జరిగేది.

టూట్ చుకే సబ్ ప్యార్ కె బంధన్, ఆజ్ కొయీ జంజీర్ నహీ
షీష-ఎ-దిల్ మే అర్మానోంకీ, ఆజ్ కొయీ తస్వీర్ నహీ
అబ్ షాద్ హూ మై, అజాద్ హూ మై
కుఛ్ కాం నహీ హై ఆహోంసె

మనిషి దుఃఖం నుంచి స్వేచ్ఛపొంది మనసు మందిరంగా, ప్రశాంతంగా మారేముందు అన్ని బంధనాలు తెగాలి. అన్ని కోరికలు నశించాలి. అది హిందీ పాటలో ఉంది. తెలుగులో లేదు. అవి విషం చిమ్మాయి. ధర్మజ్యోతి ఆదరించింది. మనసు మందిరమైపోయింది. కానీ హిందోలో అన్ని బంధనాలు వదిలాయి. అన్ని సంకెళ్లు విరిగిపోయాయి. అతని హృదయాంలో ఎలాంటి కోరికలు లేవు. ఇప్పుడు అతడు స్వేచ్ఛాజీవి ఆనందమూర్తి. ఇప్పుడు అతడు గ్రహించిన జ్ఞానం ప్రసక్తి వస్తుంది.

జీవన్ బద్‌లా, దునియా బద్‌లీ, మన్‌కో అనోఖా జ్ఞాన్ మిలా
ఆజ్ ముఝే అప్నేహి దిల్‌మే, ఏక్ నయా ఇన్సాన్ మిలా
పహూంచాహు వహా, నహి దుర్ జహా
భగ్‌వాన్ భి మేరి నిగాహోమే..

ఒకో చరణానికి ఒకో మెట్టు ఎక్కుతు వస్తున్నాడు నాయకుడు. ముందు చరణంలో గతాన్ని, పాపాలను వదిలేశాడు. రెండో చరణంలో అన్ని బంధనాలను, కోరికలను వదిలేసి ఆనందం పొందాడు. దాంతో జీవితం మారింది. ప్రపంచం మారింది. మనస్సుకి అద్భుతమైన జ్ఞానం లభించింది. దాంతో అతనిలోనే అతడికి కొత్త మనిషి లభించాడు.

ఎలాంటి దోషాలు, నేరాలు, దుష్టభావనలు లేనివాడు, ఆనందమయం, స్వచ్ఛమూ అయిన ఈ కొత్త మనిషి అతడిలోనే లభించాడు. దాంతో భగవంతుడిని సైతం దర్శించగలిగే స్థాయికి చేరుకున్నాడు. అద్భుతం! ఒక మామూలు మనిషి, దుష్టుడు, భగవంతుడిని దర్శించగలిగే అత్యున్నత ఆధ్యాత్మకమైన స్థాయికి చేరటాన్ని మూడు చరణాల్లో, ఏ వేదాంత గ్రంధానికి, ఏ తాత్త్విక బోధనకూ తీసిపోని రీతిలో ఒక సినిమా పాటలో సందర్భోచితంగా ప్రదర్శించాడు షకీల్ బదాయుని. ఈ పాట ఆరంభంలో వయోలిన్ వినిపిస్తుంది. ఆ తరువాత రఫీ 'ఓహోహో ' అంటూ, హృదయలోతుల్లోంచి వెలువడే ఆలాపనను వినిపిస్తాడు. క్రిందిస్థాయినుండి అత్యుత్తమ స్థాయికి, విషాదం నుంచి ఆనందం వైపుకు వెళ్లే వ్యక్తి హృదయ ఆలాపన అది. అందుకే పాటను ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు. తన ప్రమేయం లేకుండానే మనస్సు ఆధ్యాత్మక భావనల ప్రపంచపుటంచులను తాకుతుంది. ముఖ్యంగా జీవన్ బద్‌లా, దునియా బదలీ తరువాత రఫీ 'మన్‌కొ అనోఖా జ్ఞాన్ ' అన్న తీరు అపురూపమైన జ్ఞానాన్ని పొందిన వ్యక్తి స్వరంలా తోస్తుంది. ఆ భావనను తన స్వరంలో పలికిస్తాడు రఫీ. 'ఏక్ నయా ఇన్సాన్'లో 'నయా' దగ్గర అతి సన్నని వణుకు పాత జీవితం కొత్త జీవితంలా రూపాంతరం చెందే పురిటి నొప్పుల్లోని వేదనను స్ఫురింపచేస్తుంది. స్వరంతో భావాన్ని దర్శింపచేయటం ఇది. స్వరంతో మనస్సు చక్షువులను తెరపింపచేసి మనసు మాత్రమే అనుభవించగలిగే భావాలకు ఆకారం ఇచ్చి దర్శింపచేయటం ఇది.

ఆ తరువాత షాద్, ఆజాద్‌లను ఎంత స్వేచ్ఛగా పలుకుతాడంటే 'స్వేచ్ఛ' అంటే ఏమిటో అతని స్వరం స్ఫురింపచేస్తుంది. 'భగ్‌వాన్ ' అని పలికిన విధానం, ముఖ్యంగా 'నా' అన్న చోట దీర్ఘం తీసి, 'మేరి' అన్న చోట, నిజంగా నాకు దర్శనం అవుతోందో ' అన్న సంభ్రమాశ్చర్యం, 'నిగాహోమే' అన్నచోట ఒక నిశ్చయాన్ని పలుకుతాడు రఫీ. ఒకో పదానికి, అక్షరానికి అర్థాన్నిస్తూ, భావాన్ని స్ఫురింపచేస్తూ, అత్యద్భుతమైన స్వరనటన విన్యాసాన్ని ప్రదర్శిస్తాడు రఫీ. అందుకే రఫీ – నౌషాద్‌ల కలయికలో వచ్చిన అతి గొప్ప పాటల జాబితాలో అగ్రస్థానంలో ఉంటుందీ పాట. ముఖ్యంగా 1960 చివరలో షమ్మీకపూర్‌తో సహా, పలు హీరోలకు ప్రేమగీతాలు, అల్లరిపాటలు పాడే రఫీ, దిలీప్‌కుమార్‌కు పాడిన అత్యంత భావస్ఫోరకమైన ఈ పాట, ఆ కాలంలోని పాటలకు భిన్నంగా నిలుస్తుంది.

ఇక్కడ గమనించాల్సిందేమిటంటే, ఒక సందర్భానికి విభిన్నమైన కళాకారులు విభిన్నంగా స్పందించటం. ఈ స్పందనలో దర్శకుడి దృష్టి, నాయకుడి ఇమేజీ నిర్మాత అభిలాష ప్రభావంకూడా ఉంటుంది. అదే పాట తెలుగులో ఓ రకంగా, హిందీలో అదే భావం మరోరకంగా ఉండటం ఈ విషయాలన్నిటినీ పరిగణలోకి తీసుకుంటే బోధపడుతుంది. 'హిందీ'లో 'జ్ఞానం' పొందటానికి ప్రాధాన్యం ఇస్తే, తెలుగుపాట సంగీతం ఒక భయానక వాతావరణాన్ని, దౌష్ట్యాన్ని ప్రదర్శించటానికి ప్రాధాన్యం ఇస్తుంది. ఇందులో ఏది గొప్ప, ఏది బాగుంది అన్న మీమాంస వదిలి ఎవరి దృష్టి ప్రకారం ఆ పాట గొప్పగా ఉందని భావించాల్సి ఉంటుంది. రెండూ విని ఆలోచించి, ఆనందించాల్సి ఉంటుంది.

వచ్చేనెల మరిన్ని మధురమైన పాటలు

Post your comments